# విరహం

## బుద్ధి యజ్ఞమూర్తి

**పెళ్ళయిన మూడు నెలలకి ఆషాఢమాసమని చెప్పి సులోచనని పుట్టింటికి తీసుకొచ్చారు. ఎంతో కష్టంగా, మరెంతో అయిష్టంగా వేరే గత్యంతరం లేనట్లు వచ్చింది సులోచన.**

ఆషాఢ మాసం కొత్త దంపతుల పాలిట ఒక శాపమనీ, వాళ్ళ ప్రేమానురాగాలకీ, నిగ్రహానికీ పరీక్ష లాంటిదనీ తనకి తెలియంది కాదు. అది తెలిసుండబట్టే వంశీతో ఈ వియోగానికి మానసికంగా ప్రిపేరయింది. అయినా కానీ వంశీని విడిచిపెట్టేప్పుడు తనకి దుఃఖం తన్నుకు వచ్చింది. అసలు తన కంటే ముందే వంశీ కళ్ళల్లో నీళ్ళు తిరిగిన సంగతి తను గమనించింది.

రైలు కదులుతుంటే తన వేయి పట్టుకుని "పోగానే ఉత్తరం వేస్తావు కదూ. నా ప్రాణమంతా నీ మీదే వుంటుంది" అని వంశీ గద్గదికంగా చెప్తుంటే అమాంతం రైలు దిగిపోయి "నిన్ను విడిచి ఎక్కడికీ పోను వంశీ" అని చెప్పాలన్నంత ఉద్వేగం తనలో కలిగింది. వంశీ కనుమరుగవుతుంటే మనసులో అతడికి దూరమవుతున్నానే అనే దిగులూ, వ్యథా తప్ప మరో భావమంటూ లేకుండా పోయి కళ్ళలో నీళ్ళు తెప్పించాయి. 'ఇది సహజమేలే' అనుకున్నట్లు నాన్న తన స్థితిని గమనించీ ఏమీ మాట్లాడలేదు.

ఆషాఢమాసం కొత్త పెళ్ళికూతురు పుట్టింట్లో వుండాలన్న సంప్రదాయం ఏ మహానుభావుడు ప్రవేశపెట్టాడో కానీ... అతనికి చేతులెత్తి నమస్కారం చెయ్యాలని ఉంది. ఖచ్చితంగా ఇది మగవాడి పనే అయివుంటుంది. ఆడవాళ్ళు ఇంత కఠిన హృదయులు కారు. అతగాడి ఉద్దేశం ఏమై వుంటుందో ఈ సంప్రదాయం నెలకొల్పడంలో. కొత్త దంపతులు వియోగంతో ఎట్లా బాధలు పడతారో, దిగులుతో ఎట్లా కృశిస్తారో చూసి వినోదిద్దామని ఉబలాటపడి తన సరదాని 'ఆషాఢమాసం' పేరుతో తీర్చుకుని వుంటాడు. అదే ప్రచారంలోకి వచ్చి సంఘంలో ఆచారంలో మారిపోయి వుంటుంది.

పుట్టింట్లో అడుగు పెట్టిన క్షణం నుండే ఈ రకమైన ఆలోచనలు వస్తున్నాయి సులోచనకి.

అన్నా, వదినల సరస శృంగార చేష్టలు ఆమె పడే బాధని రెట్టింపు చేస్తున్నాయి. వాళ్ళని చూస్తూ మనసునీ, ఒంటినీ అదుపులో పెట్టడం శక్తికి మించిన పనైపోతోందామెకి.

అన్న స్నానం చేస్తుంటే వదిన వీపు రుద్దడం, ఇంక తన పని అయిపోయింది కదాని వదిన పోబోతుంటే అన్న చటుక్కున వదిన్ని వాటేసుకోడం— కిటికీలోంచి సులోచనకి స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె కళ్ళముందు ఆ దృశ్యం మారి మరో దృశ్యం ఆవిష్కరించింది. అది హైదరాబాద్‌లో తాముంటున్న ఇంటిలోనిది.

ఫ్రెష్‌గా తలస్నానం చేసి అందమైన పెరటి ఒత్తుగా వుంటే తన కురులని ఆరబెట్టుకుంటూ ఎప్పుడూ పాడుకునే కృష్ణశాస్త్రి గీతం—

"సిగలో, అవి విరులో
అగరు పొగలో, అత్తరులో?" అని చిన్నగా పాడుకుంటోంది. ఆఫీస్ నుండి వచ్చిన వంశీని వెంటనే గమనించలేదు. పాట పూర్తయ్యాక చూసింది. ప్రేమగా, తదేకంగా చూస్తున్నాడు వంశీ. తన కళ్ళముందున్న ఆ సౌందర్యమంతా తన స్వంతమే అయినా నిగ్రహాన్ని పాటించాడు. తన ఒళ్ళు చెమటకంపు కొడ్తోంది. దాన్ని పోగా





ఈ వారం శృంగారకథ

ట్టుకోవాలి ముందు. స్నానానికి పోయాడు. చేతిలోని పొట్లం స్టూల్ మీద పెట్టి.

సులోచనకి తామిద్దరూ కలిసి స్నానం చేయాలని వుంటుంది. రెండు, మూడు వాటాలుండే ఈ అద్దెకొంపల్లో అది తీరని కోర్కెగా మిగిలిపోతోంది. బాత్‌రూమ్‌లన్నీ కట్టకట్టినట్లు ఒక్కచోటే ఉంటాయి. అయితే ఒక్క సౌకర్యం మాత్రం ఉంది. వంశీతో కావాల్సినంత ఏకాంతం. వంశీ ఆఫీసుకి వెళ్ళినప్పుడు పుస్తకాలతోనో, ప్రక్కవాటాల వాళ్ళతోనో కాలక్షేపం చేస్తోంది.

వంశీ స్నానం కానిచ్చి... వంట గదిలోకి పోయాడు. మాంచి వేడిమీద, టీ కలుపుతోంది సులోచన. వెనగ్గా పోయి నడుము చుట్టూ వేసి, వాటేసుకుని, మెడమీద ముద్దు పెట్టుకున్నాడు. లోపలెంత వేడున్నా చన్నీటి స్నానం చేత అతడి చేతులు మహా చల్లగా వున్నాయి. ఆ చల్లదనం ఆమె లేత చర్మానికి షాక్ కలిగించింది. ఆ చేణుకుకి ఏమాత్రం ఏమరుపాటుగా వున్నా టీ మొత్తం 'గచ్చు'పాలయ్యేదే.

ఒక్కసారిగా కోప్పడాలనుకున్న ఆమెకి మెడ మీద అతడిచ్చిన ముద్దు ఆ భావాన్ని అణచివేసింది. అయినా బెట్టు చేయాలి కనుక ''వదులు... అబ్బాయికి ఇంకేం పని వుండదు'' అంది.

ఏమీ విననట్లే— మరింత గట్టిగా బిగుసుకున్నాయి అతడి వేళ్ళు. అప్పుడు— తప్పలేక— మెడతిప్పి అతడి పెదాల మీద ముద్దుపెట్టి, నవ్వి ''పద'' అంది కళ్ళతో.

వదిలి— ''రోజు, రోజుకీ నీలో అందం పెరుగుతున్నట్టుగా అన్పిస్తోంది'' అని చప్పున వంగి నడుము మీద ముద్దుపెట్టాడు.

మత్తుగా నవ్వి అతడి చెంపమీద చిన్నగా తట్టి ''అబ్బాయి గారి వేషాలు కూడా రోజురోజుకీ మితిమీరి పోతున్నాయి'' అంది.

నవ్వుకున్నారిద్దరూ...

టీ తాగినాక ''సినిమాకి పోదామా?'' అడిగాడు.

''రెండున్నర గంట... అబ్బ! బోర్. టైమ్ వేస్ట్'' అంది తలనొప్పిని అభినయిస్తూ... అయిష్టాన్ని వ్యక్తపరుస్తూ.

అందులో ఏదో సూచన అర్థమై ''నిజం. మనమే ఇప్పుడో డ్యూయెట్టు పాడుకుంటే పోలా'' అని స్టూల్ మీదున్న పొట్లాం విప్పి, మల్లెపూలని ఆమె జడకి తనే అలంకరించాడు. ఆ పూల మధ్య తన ముక్కుని దాచి, ఆ సౌరభాన్నంతా పీలుస్తూ... మత్తుతో శృంగార భావాలెన్నో మనసుని కోసేస్తుంటే— ఆమె మెడ చుట్టూ చేతులేసి... ''సులోచనా! నా అంత అదృష్టవంతుడు లేడు కదా'' అన్నాడు.

జవాబు చెప్పలేదామె. అతడి చర్యతాలూకు మైకం నరనరాన్ని గుంజేస్తుంటే కళ్ళు మూసుకుంది. పెదాలు వణికిపోతున్నాయి. తాపాగ్నితో శరీరం దహించుకుపోతోంది. వంశీ పెదాలతో ఆమె మెడనీ, భుజాలనీ తడుముతున్నాడు, కాంక్ష తీవ్రమవుతుంటే.

హఠాత్తుగా దృశ్యం చెదిరిపోయింది.

ప్రక్క గదిలోంచి అన్నావదినల నవ్వులు వినిపిస్తున్నాయి.

సులోచన అక్కణ్ణుంచి లేచింది.

★ ★ ★

వంశీ నుండి ఉత్తరమొచ్చింది. విరహంతో ఎంతగా అల్లాడిపోతున్నాడో, రాత్రులెంత కష్టంగా, నిద్రలేకుండా గడుస్తున్నాయో కళ్ళకు కట్టినట్లు రాశాడు. చదువుకున్న సులోచనకి అతడి బాధలు తలుచుకుంటుంటే ఏడుపు వచ్చేస్తోంది. దిగులుతో పదిరోజులకే ఆమె ముఖం వాడిపోయింది.

ఇంట్లో వాళ్ళంతా కనిపెట్టేశారు.

''ఏవమ్మా, వచ్చి నిండా పదిరోజులయ్యిందో, లేదో... అప్పుడే ఇంత దిగులా?'' అని ఆటపట్టించబోయింది వదిన.

ఆ మాటల్తో లోపలి దిగులంతా బయటకి తన్నేసింది సులోచనకి. ఏడుస్తూ తన గదిలోకి పోతున్న సులోచనని అందరూ విశ్చలంగా చూశారు తర్వాత ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

''దీనికప్పుడే అబ్బాయి మీద గాలి మళ్ళింది. కోడలు పిల్ల దాన్ని బయటపెట్టేసరికి ఆపుకోలేకపోయింది పిచ్చి పిల్ల'' అంది తల్లి. తన కూతుర్ని అల్లుడెంత ప్రేమగా చూసుకుంటున్నాడో వూహించుకుంటూ అవునన్నట్లు తండ్రి తలపంకించాడు.

''ఏరా?'' అన్నాడు కొడుకు వంక ఏం చేద్దామన్నట్లు చూస్తూ.

''బావకి టెలిగ్రామ్ ఇస్తాను— రమ్మని'' అన్నాడతను.

''ఆ పనేదో తొందరగా చేసేయండి'' అని తొందర పెట్టింది సులోచన ఒదిన.

అవతల గదిలోంచి వింటోన్న సులోచన కన్నీళ్ళు తుడుచుకుంది.

వంశీ వచ్చేస్తాడనుకుంటే... పెదాల మీదికి నవ్వు వచ్చేసింది. గట్టిగా దిండును వాటేసుకుని, దాన్ని వంశీగా ఫీలవుతూ ముద్దుపెట్టుకుంది.